

# కార్టూనిస్టు — కాలేజి అమ్మాయిలూ

## యమ్. బాలసరస్వతీదేవి

రాంబాబు తన నూరో కార్టూను పత్రికలో పడ్డ శుభ సమయాన్ని పురస్కరించుకుని హోటల్లో కూచుని ఉల్లిపాయ పకోడీలు తింటున్నాడు.

రెండు ప్లేట్లు తిని, మూడోరౌండు మిరపకాయ బజ్జీ మొదలు పెట్టబోతుంటే — ''నమస్కారమండీ!'' అన్న కోకిల కంఠం వినిపించింది.

నోట్లో పెట్టబోతున్న బజ్జీ చెయ్యి అలాగే వుంచి రాంబాబు తలెత్తి చూసేడు.

దాదాపు రెండడుగుల దూరంలో సన్నగా తీగలావున్న ఓ యువతి, గాలికి రేగి నుదుటిమీద పడుతోన్న వుంగరాల జుత్తును ఎడం చేత్తో వెనక్కి తోసుకుంటూ, బుగ్గలు సొట్టపడేలా నవ్వుతూ టేబుల్ అంచుకు కొంచెం దూరంలో నిలబడి తనకేసి చూస్తోంది.

రాంబాబు అనుమానంతో .... జేబులోనించి కళ్ళద్దాలు తీసి పెట్టుకుని చూసేడు.

అమ్మాయే!

''అమ్మబాబోయ్!'' అనుకున్నాడు రాంబాబు.

అమాంతం బజ్జీ ప్లేట్లో పారేసి, లేచి నించుని అపర శివుడి పోజులో—''బాలా! ఏమి నీకోరిక?'' అని అడగాలన్నంత ఉషారు పుట్టుకొచ్చింది. కాని, అసలే అమాయకంగా....నోట్లో చాక్లెట్ పెడితే తినలేని దానిలా వున్న యీ అమ్మడు, పాపం—సూదిముక్కు కూడా వుంది—జడుసుకుంటుందేమో అని జాలేసి, బజ్జీ చెయ్యి ముందుకు చాపి—''కూచోండీ'' అంటూ మర్యాద చేసేడు.

కూచుని, తెల్లపవిట భుజాలచుట్టూ తిప్పుకుని—''నాపేరు సత్యభామ. మీ కార్టూన్లంటే చెవి కోసుకుంటాను'' అంది చిన్నగా నవ్వుతూ.

రాంబాబు నవ్వేడు. ''అబద్ధాలు. మీ చెవులు బాగానే వున్నాయి.''

''మళ్ళీ అతికించేసుకుంటానుగా'' అని నవ్వి—''మిమ్మల్ని చూడాలని ఎన్నాళ్ళుగానో కోరిక. మీ కార్టూన్లన్నీ బైండు చేయించుకుని దాచుకున్నాను కూడా. మీది యీ వూరే అన్న సంగతి ఇంతవరకు నాకు తెలీదు.''

''నా కార్టూన్లు బైండు చేయించుకుని దాచుకునే అందమైన పాఠకురాలు యీ వూళ్ళోనే వున్నది అన్న సంగతి ఇంతవరకు నాకూ తెలీదు....''

సత్యభామ నవ్వేసింది.

రాంబాబు ''బజ్జీ తింటారా?'' అని సత్యభామని అడగబోయి, చేతిలోవున్న ఒక్క బజ్జీ తను సగం తిన్నది అన్న సంగతి జ్ఞాపకం వచ్చి—ఎంగిలి తింటుందో, తినదో...అన్న అనుమానంతో మిగిలిన బజ్జీ ముక్క కొంచెమూ తినేసి, మంచి నీళ్ళు తాగి ఎడం చేత్తో క్రాపు సవరించుకుంటూ టేబుల్‌మీదకు వంగి—

''ఇఫ్ అయాం నాట్ మిస్టేకెన్ మీరు స్టూడెంట్ కదూ?''

''బాబోయ్! ఎలా కనిపెట్టేసేరు?'' అంది సత్యభామ ఆశ్చర్యంగా.

''అది రహస్యం!'' అని నవ్వి—''ఏం చదువుతున్నారు?'' అని అడిగాడు.

''బి. ఎ. ఫైనల్.''

''ఏ కాలేజి?''

చెప్పింది.

''ఉమెన్స్ కాలేజి అన్నమాట!'' అంటూ ఉత్సాహంగా ముందుకు వంగి—''మీ అమ్మాయిలు నన్ను తిట్టుకుంటారటగా?'' అన్నాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

సత్యభామ ముఖం ఎర్రబడింది. ''ఎవరు చెప్పేరు మీకు అమ్మాయిలు మిమ్మల్ని తిట్టుకుంటారని?'' అంది కోపంగా.

''తిట్టుకోరా అయితే?'' అన్నాడు రాంబాబు దిగులుగా.

''ఊహు. అయినా, నేను అభిమానించే వ్యక్తిని తిట్టుకునే వాళ్ళ స్నేహం నేను చస్తే చెయ్యను. ఐ హేట్ దట్—''

''మంచినీళ్ళు తాగండి'' అంటూ రాంబాబు గ్లాసుతో నీళ్ళు అందించేడు. సత్యభామ సిగ్గుపడి గ్లాసు పుచ్చుకుని ప్రక్కన పెట్టేసింది.

''నా కోపం చూస్తే మీకు నవ్వొస్తోందికదూ?'' అంది వుడుక్కుంటూ.

''ఊహు. ప్రేమొస్తోంది'' అందామనుకున్నాడు. హుం! ఈ మల్లెమొగ్గకి యీ మాత్రం రొమాన్సు కూడా తెలుస్తుందా?



" బాధపడుతున్నారా....? టేకిట్ ఈజీ రాం బాబుగారూ!"

" అబ్బే...." అన్నాడు రాంబాబు అమాయకంగా.

సత్యభామ నవ్వింది. రాంబాబు కూడా నవ్వి– "మీలాటి అభిమాని దొరకటం నా అదృష్టం. మీ పరిచయం కలిగిన యీ శుభ సమయంలో మంచి బాదంఖీర్ తాగుదాం ఉండండి!" అంటూ బెల్ కొట్టి, సత్యభామ వారిస్తున్నా వినకుండా రెండు బాదంఖీర్ తెప్పించి "ప్లీజ్. నా కోసం" అంటూ ఓ గ్లాసు ఆమె కేసి జరిపాడు.

" బాదంఖీర్ అన్నా, బాతాఖానీ అన్నా నాకు యిష్టం. మీకో?"

" నాకు మా బామ్మ అంటే ఇష్టం. బాదంఖీర్ చెయ్యడంలో, బాతాఖానీలో ఆవిడ ఫస్టు!"

సత్యభామ నవ్వేసింది. ఇద్దరూ బాదంఖీర్ దగ్గిరికి తీసుకుని 'తినటం' మొదలు పెట్టేరు. సత్యభామ జీడిపప్పు ముక్కలు తింటూ మెల్లగా అతని కార్టూన్లంటే తనకు ఎంత అభిమానమో, అతని తరఫున తను అమ్మాయి లందరితోనూ ఎలా పోట్లాడుతుందో, తన ప్రాణస్నేహితురాలు ఒకామె ఓసారి అతను గీసిన అప్పడాల కర్ర కార్టూను చూసి తిట్టిందని తను ఆమె స్నేహానికి శాశ్వతంగా ఎలా 'గుడ్ బై' చెప్పిందో చెబుతోంది.

" ఎవరా ఫ్రెండు?" అన్నాడు కుతూహలంగా ముందుకు వంగి.

" వెంకట తాయారని రెండొందల పౌన్లుంటుంది. రెండుజెళ్ళు వేస్తుంది. ముందు పళ్ళు కొంచెం ఎత్తు."

రాంబాబు గబగబా గ్లాసెడు నీళ్ళు తాగి– "మీ చీర బావుంది!" అన్నాడు గబుక్కున.

" చీరా?"


" చీర!"

సత్యభామ నవ్వి–" బొంబేనించి మా భయ్యా పంపేరు. ఈ పింక్ కలర్ అంటే నాకు ఎంతో యిష్టం"

" నాక్కూడా పింక్ కలర్ అంటే యిష్టం."

" ఓ షర్టు కుట్టించుకోండి. పింక్ మీకు బావుంటుంది!"

" ఓ. కె!" అన్నాడు రాంబాబు, సత్యభామ వెంకటతాయారు గురించి మర్చిపోయినందుకు హాయిగా వూపిరి పీల్చుకుంటూ.



" నేను మిమ్మల్ని ఒకటి అడుగుతాను. దానికి కూడా మీరు ఓ. కే. అనాలి మరి...."

" ఓ. కె. అనాలంటున్నారుగా. అడిగేసే యండి మరి" అన్నాడు నవ్వుతూ. ఏ మడుగుతుందబ్బా? అప్పు కావాలంటుందా? ఆ మధ్య చదివిన కథలో ఇలాగే సూదిముక్కు వున్న ఓ అమ్మడు ఓ అబ్బాయితో మాటలు వేసుకుని కాసిని కబుర్లూ గట్రా చెప్పి నవ్వించి–ఆనక– " ఓ పాతిక అప్పివ్వరూ, ప్లీజ్...."అంటుంది. ఆడపిల్ల అలా 'ప్లీజ్' అంటే అప్పివ్వని మగాడు ఎప్పుడు పుట్టేడు?

" మేమంతా రూఫ్‌లో చిన్న పార్టీ చేసుకుంటున్నాం మీరు గెస్టుగా, సర్దాగా రావాలి...."

" అమ్మాయిలేనా?" అన్నాడు రాంబాబు ఆత్రంగా.

" పదిమందీ అమ్మాయిలే!" అంది.

రాంబాబు పన్నెండు సెకండ్లలో బాదంఖీర్ తాగేసి, ఎడంచేత్తో క్రాపు సర్దుకుంటూ లేచి నిలబడి–" పదండి" అంటూ బయలుదేరేరు.


సత్యభామ టేబుల్ మీద పెట్టిన బేగ్ తీసుకుంది.

" ఒన్ మినిట్!" అంటూ రాంబాబు టాయిలెట్ రూం లోకి పరుగెత్తి తలుపు మూసుకున్నాడు. జేబులోనుంచి దువ్వెన తీసి జుట్టు ఒంకులొంకులుగా దువ్వుకున్నాడు. మినీ పౌడరు డబ్బాలోనించి పౌడరు ఒంపుకుని ముఖానికి రాసుకుని అద్దంలో ముఖం చూసుకున్నాడు. " ఇడియట్. ఇవాళ లేచి ఎవరి ముఖం చూసేనో అమ్మాయిల మధ్య అక్కినేనిలా వెలిగిపోయే యోగం పడుతోంది" అని బుగ్గమీద చిటికేసుకుని, దువ్వెనా, పౌడరు పెట్టే జేబులో పెట్టేసుకుని ఇవతలికి వచ్చి.... "పదండి!" అన్నాడు నవ్వుతూ.

సత్యభామ నవ్వి—" మెడ దగ్గిర పౌడరు కొంచెం ఎక్కువయింది. తుడుచుకోండి" అంటూ పర్సులోనించి రుమాలు తీసి అందించింది.

రాంబాబు పౌడరు తుడుచుకుని, రుమాలు తిరిగి ఇచ్చేసేడు. సత్యభామ పర్సులో పెట్టుకుంది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ మెల్లగా మెట్లెక్కడం ప్రారంభించేరు.



'' మావాళ్ళు కొంచెం కోతులు. ఏవన్నా అల్లరి చేస్తే ఏవీ అనుకోవద్దు ప్లీజ్ '' అంది.

'' నేను కార్టూనిస్టునని మర్చిపోకండి. అల్లరి మా వూపిరి!''

'' సారీ!'' అని నవ్వేసింది సత్యభామ. ఇద్దరూ మెట్లెక్కి పైకి చేరుకున్నారు. ఏదో మంత్రశక్తితో అమ్మాయిలుగా మారిపోయిన రంగుల పూలగుత్తుల్లా వున్న పదిమంది అమ్మాయిలు రకరకాల దుస్తుల్లో హుషారుగా అటూ ఇటూ తిరుగుతూ కేరింతలు కొడుతున్నారు. పిట్టగోడ మీద యువరాణి పోజులో కూచున్న ఓ ఎర్ర చీర యువతి ఇద్దర్నీ చూసి పాట ఆపేసి– '' సర్వర్ని తీసుకొస్తానని అప్పుడనగాపోయి ఇప్పుడా రావటం దుర్మార్గురాలా!'' అంటూ కోప్పడింది.

'' ఈయన రాంబాబుగారు. ఎమ్మే'' అంది సత్యభామ ముఖం ఎర్రగా చేసుకుంటూ.

'' సారీ!'' అంది ఎర్ర చీర యువతి నాలిక్కొరుచుకుని. అమ్మాయిలంతా వెనక్కి తిరిగి చూసి – '' హాయ్ '' అంటూ పరిగెట్టుకుంటూ– ఇద్దర్నీ చుట్టు ముట్టేరు.

'' హాయ్....'' అన్నాడు రాంబాబు పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని, చిరునవ్వు నవ్వుతూ! కళ్ళజోడు కమల రాంబాబు పక్కన చేరింది.

'' మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది. ఎక్కడ?'' అంటూ కళ్ళజోడు మీద చూపుడు వేలుతో సుతారంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది.

'' ఫొటో చూసుంటారు '' అన్నాడు రాంబాబు గొప్పగా.

'' ఆదే అయుంటుంది. ఇంట్లోనించి ఎందుకు పారిపోయేరు పాపం?'' అంది జాలిగా.

'' ఆయనేం ఇంట్లోనించి పారిపోలేదు. ఇంట్లోనే కూచుని, ఒక్కోసారి వీధిలో కూడా కూచుని కార్టూన్లు గీస్తారు. కదండీ?''

'' కొంపతీసి, యీయన మన రాంబాబుగారు కాదుకదా?''

'' ఆయనే!'' అంది సత్యభామ గర్వంగా.

అమ్మాయిలంతా ఆనందంతో కెవ్వున కేక వేసేరు. ఇంతసేపూ చెప్పనందుకు సత్యభామని గిల్లేసి–పరుగెత్తుకెళ్ళి ఓ కుర్చీ పట్టుకొచ్చి మధ్యలో వేసి రాంబాబుని కూచోబెట్టేరు. తామంతా గోపికల పోజులో చుట్టూ కూచున్నారు.



ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ వారు బాలల దినోత్సవ సందర్భంగా గుంటూరు జిల్లాలో నిర్వహించిన కూచిపూడి (జూనియర్స్) నాట్యం పోటీలలో–జొన్నలగడ్డ అనూరాధ ప్రథమ స్థానంలో వచ్చింది. ఎనిమిది సంవత్సరాల ఈ అమ్మాయి గుంటూర్లోని సెయింట్ జోసఫ్ గర్ల్స్ హైస్కూలులో నాలుగవ తరగతి చదువుతున్నది. హైద్రాబాదులో మొదట్లో వేదాంతం జగన్నాధశర్మగారి దగ్గర నాట్యం నేర్చుకుని, ఇప్పుడు సుబ్బలక్ష్మి ముకుంద బాబు దగ్గర గుంటూర్లోనే–నాట్యం అభ్యసిస్తున్నది.

'' ఇన్నాళ్ళూ మీ కార్టూన్లు చూసేం. ఇవాళ మిమ్మల్ని చూడగలుగుతున్నాం. ఈ రోజు ఎంత మంచి రోజు '' అంది ఎర్ర చీర అమ్మాయి అరమోడ్పు కళ్ళతో. ఎర్ర చీర అమ్మాయి పేరు కోకిల.

'' ఈ రోజు సత్యభామ పుట్టినరోజు '' అంది శుభలేఖ.

'' అవునండీ. ఇవాళ నా బర్త్ డే '' అంది సత్యభామ.

'' అన్యాయం. ఇంతవరకూ చెప్పకుండా దాచుకున్నారు కదూ?'' అని సత్యభామకి 'హేపీ బర్త్ డే' చెప్పి – '' బైదిబై, మీకు భర్త వున్నాడా?''

"హాయ్....హాయ్...." అంటూ నవ్వేసేరంతా.

'' మీ కార్టూన్లంత తియ్యగా వుంటాయండీ మీ కబుర్లు కూడా....''

'' ఐతే ఇకనించి కాఫీలో నేను పంచదార వేసుకో నక్కర్లేదన్నమాట. కార్టూన్లు వేసుకుంటే సరిపోతుంది.''

'' ట్రైచేసి చూద్దామా?'' అంది మీరా.

'' కాఫీలు ఇంకా రాలేదు. అందాకా కబుర్లు చెప్పండి. అనక ట్రైచేద్దాం '' అంది కళ్ళజోడు కమల.

'' కబుర్లు–కమల లోచనలవంతు '' అన్నాడు రాంబాబు.

కమల, సులోచనాలను సవరించుకుని కబుర్లు చెప్పడానికి ట్రైచేసి, ''లాభం లేదు. కళ్ళజోళ్ళతో కబుర్లు చెప్పలేం. కంఠంతో చెప్పగలం '' అని తేల్చేసింది.

'' కళ్ళతో కూడా!'' అని కలిపింది దేవి.

సర్వర్లు ట్రేలతో పదిరకాల స్వీట్లూ, ఐదారు రకాల హాట్లూ మోసుకొచ్చేరు. అమ్మాయిలంతా నడుం చుట్టూ కొంగు బిగించుకుని ఒకళ్ళ ప్లేట్లలో ఒకళ్ళు అన్నీ సర్దేసి – అంతా కలిసి రాంబాబు ప్లేటులో తలోరకం వేసేసేరు.

'' అమ్మ బాబోయ్! ఏవిటిదంతా?'' అన్నాడు గాభరాగా.

'' అమ్మాయిలు పెట్టినవి పారేస్తే పాపమండీ. ఎలాగో తినేసేయాలి.''

'' నిజంగా పాపమే నంటారా?'' అన్నాడు రాంబాబు దిగులుగా.

'' ఘోర పాపం. వచ్చే జన్మలో ఇక ఏ అమ్మాయి చేత్తోనూ ఏవీ తినే అదృష్టం వుండదు. తర్వాత మీ ఇష్టం.''

'' ఎలాగో తినేస్తాను లెండి '' అంటూ రాంబాబు చొక్కా చేతులు పైకి లాక్కుని ప్లేటు దగ్గిరికి లాక్కున్నాడు. అమ్మాయిలంతా కబుర్లు చెప్పుకుంటూ, జోకు లేసుకుంటూ తినటం మొదలుపెట్టేరు.

'' పేరులోనే వున్నది పెన్నిధి. అని రాసిం దెవరు?'' అంది వకుళ హఠాత్తుగా.

'' నేను కాదు!'' అంది దేవి గబుక్కున. పాత జోకు అయినా అంతా నవ్వేరు.

'' పేరు రీత్యా చూస్తే రాంబాబుగారు అమ్మాయిల గాలి తగలగానే కిలోదూరం పరుగెత్తాలి. కాని, పరుగెత్తటం లేదుగా.''

'' ఆయన పరుగెత్తుకుంటూనే పైకి వచ్చేరు అమ్మాయిల పేరు వినగానే. కదండీ?'' అంది సత్యభామ. నోట్లో 'బాసుందీ' వుండటంవలన రాంబాబు 'అవునన్నట్లు' తల కదిపి సైగ చేసేడు.

'' అయితే శ్రీరామచంద్రుడి పేరు మీకు పనికిరాదు. మార్చేయాల్సిందే. ఎలా మార్చేయ మంటారు?'' అంది శుభ లేఖ.

రాంబాబు బాసుందీ తినేసి '' మీ ఇష్టం. నన్ను మార్చేస్తానన్నా నాకేం అభ్యంతరం లేదు '' అన్నాడు బుద్ధిమంతుళ్ళా.

" మార్చేయడానికి మీరేవఁన్నా కరెన్సీనా? కంచర సామానా? ఉత్త కార్టూనిష్టు. ఏం లాభం వుండదు" అంటూ మీరా దిగాలు పడిపోయింది.

"కార్టూనిష్టులకి మార్కెట్లో గిరాకీ వుండదా పాపం?" అంది జిమ్మీ జాలిగా.

"గీర వుందని నిరూపించేసుకుంటారుగా అమ్మాయిల మీద కార్టూన్లు గీసి. అంచేత ఆడ పిల్లలకి కోపం. ఏ అమ్మాయయినా 'అయ్యో పాపం!' అని పెళ్ళి చేసుకోవాలి!"

"అయ్యో పాపం!" అంది హేమా. అమ్మాయిలంతా కలిసి పట్టుకునేలోగా క్రిందికి పారిపోయింది.

"కార్టూనిష్టులంటే మీకు లోకువగా వున్నట్టుంది. రోజూ నాకు అమ్మాయిల దగ్గిర్నించి ఎన్ని వుత్తరాలు వస్తాయో తెలుసా?" అన్నాడు రాంబాబు.

"తెలీదండీ" అన్నారు అమాయకంగా. "ప్లీజ్. మాకు చూపించరూ?" అంటూ గోల చేసేరు.

"మీరిలా రాంబాబుగార్ని గోలచేస్తే ఇక్కణ్ణించి వెళ్ళిపోతాం అంతే" అంది సత్యభామ కోపంగా, చేతిలో స్పూను టక్కున ప్లేట్లో పారేసి.

"గోల చెయ్యం. వెళ్ళిపోవద్దు ప్లీజ్" అంటూ బ్రతిమాలేరంతా.

"ఐతే, రాంబాబుగారికి 'సారీ' చెప్పండి."

"'సారీ' అండీ" అంటూ అంతా కోరస్‌గా రాంబాబుకి 'సారీ' చెప్పేరు.

"నెవర్ మైండ్!" అన్నాడు రాంబాబు చిన్నగా నవ్వుతూ. అమ్మాయిలు అన్నిటిలోనూ కొంచెం కొంచెం కొరికి ప్లేట్లలో వదిలేసేరు. రాంబాబు మాత్రం కష్టపడి అన్నీ తినేసేడు (తన ప్లేటులోవి). పార్టీ ఐపోయింది. అందరూ కుర్చీల్లో జారగిలబడి కబుర్లలో పడ్డారు.

పావుగంట గడిచింది.

యూనిఫారంలో వున్న ఓ సర్వరు పైకొచ్చేడు. "కమలగారూ, వకుళగారూ అట. ఎవరో ఫోన్‌లో పిలుస్తున్నారు" అని చెప్పేడు.

వకుళా, కమలా లేచి "ఎవరమ్మా, ఎవరెవరమ్మా..." అని పాడుకుంటూ క్రిందికి పరుగెత్తేరు. పదినిమిషాలయినా పైకి రాలేదు. "వీళ్ళేమయే రబ్బా!" అంటూ గాభరాపడుతూ నలుగురమ్మాయిలు లేచి బయలుదేరబోయేరు.

"నే చూసొస్తాలెండి" అన్నాడు రాంబాబు లేవబోతూ. ఇంతలో కమలా, వకుళా పైకొచ్చేరు. "వసుంధర ఇంట్లో పార్టీగా. మరీమరీ రమ్మని మొన్ననే బ్రతిమిలాడింది పాపం. వస్తామని ప్రామిస్ చేసి మర్చిపోయేం. మా ఇంటికి కబురు చేస్తే మమ్మీ మనమంతా ఇక్కడున్నాం అని చెప్పేసిందిట. ఇప్పుడు వసూయే ఫోన్ చేస్తే. పార్టీ కట్టేసి బయల్దేరి వస్తారా, లేక బంధుమిత్ర సమేతంగా మీమీద దాడిచేసి కట్టకట్టి ఎత్తుకుపొమ్మంటారా....అని బెదిరిస్తోంది!" అన్నారు.

"నేను రాను. మీరు వెళ్ళండి కావలిస్తే. పార్టీకి రమ్మని పిలిచి గెస్ట్‌ని వదిలేసి పోవడం ఏం న్యాయం?" అంది సత్యభామ లేవకుండా.

"ఫర్వాలేదు. వెళ్ళండి. నేను వెళ్ళిపోతాను" అని రాంబాబు కుర్చీలోనించి లేవబోయేడు.

"వద్దు రాంబాబు గారూ, కూచోండి. వసుంధర ఎప్పుడన్నా వుంటుంది. మీరు మహా వుంటే గంటో, అరగంటో వుంటారు. అదీగాక ఇన్నాళ్ళకి మిమ్మల్ని కలుసుకోగలగటం నాంకెతో ఆనందంగా వుంది. మీరు పోతే పొండి. నేను రానన్నానని చెప్పండి."

"పసుంధర తిరుతుందేమోనే!" అంది కళ్ళజోడు కమల.

"గో టు హెల్. అదీ, మీరూ కట్ట కట్టుకుని స్విమ్మింగ్‌పూల్‌లో దిగండి!

"ముందుగా మెట్లు దిగుతాం" అంటూ అంతా చెప్పులేసుకుని రాంబాబుకి 'సారీ' చెప్పి ఇద్దరికీ 'టాటా' చెబుతూ క్రిందికి వెళ్ళిపోయేరు.

రాంబాబూ, సత్యభామా కబుర్లు చెప్పుకుంటూ కార్టూన్ల గురించీ, కథల గురించీ మాట్లాడుకుంటూ కూచున్నారు.

పడమటి కొండమీద పూల రథంలా సూర్యుడు దిగుతున్నాడు. లేత గాలి పూల తీగల మీదినించి తేలి వస్తూ చెంపలను స్పృశిస్తోంది. అరగంట గడిచింది.

ఇందాకటి సర్వరు మళ్ళీ పైకి వచ్చి—"మిమ్మల్ని ఫోన్‌లో పిలుస్తున్నారండీ" అన్నాడు సత్యభామతో.

"వీళ్ళకి బుద్ధిలేదు. ఆ వసూ రాస్కేల్‌కి అసలే లేదు. రానని గట్టిగా చెప్పేసి వస్తాను, వుండండి, ప్లీజ్" అని క్షమార్పణలు చెప్పుకుంటూ, తన విసుగునంతా చెప్పులమీద చూపించుకుంటూ, హైహీల్సు టకటకలాడించుకుంటూ క్రిందికి వెళ్ళింది. జోళ్ళ చప్పుడు దూరం అయేక రాంబాబు జేబులోనించి దువ్వెన తీసి పైపైన దువ్వుకుని, పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని అటూ ఇటూ పచార్లుచేయటం మొదలు పెట్టేడు.

ఎవరో పైకి వచ్చిన చప్పుడయింది. రాంబాబు తిరిగి చూసేడు. వెయిటర్ ఓ చీటి రాంబాబు చేతి కిచ్చి పక్కన నుంచున్నాడు.

"ఎవరిచ్చేరు?" అన్నాడు రాంబాబు చీటి విప్పుతూ.

"ఇంతవరకూ ఇక్కడున్న అమ్మాయిలంతా ఇచ్చేరు సార్!"

"అందరూనా?" అన్నాడు రాంబాబు ఆశ్చర్యంగా. "ఎక్కడున్నారు వాళ్ళంతా?"

"ఇప్పటి వరకూ క్రింద హాల్లో కూర్చున్నారు.



ఈ చీటి మీ కిమ్మని చెప్పి అంతాకలిసి ఎర్ర కారులో వెళ్ళిపోయేరు."

రాంబాబు చీటి విప్పేడు గబగబా.

"కార్టూనిష్టూ!

బై బై! మా మీద ఇష్టం వచ్చినట్టు బొమ్మలు గీసి, ఏడిపిస్తావా! అహ్హా! బిల్లు ఇచ్చేయమ్మా. లేకపోతే ఇంచక్కా పప్పు రుబ్బెయ్!

ఇట్లు

అఖిల భారత అమ్మాయిల సంఘం అధ్యక్షురాలు

సత్యభామ, బృందం.

పి. ఎస్:—మా ప్లానుకి బోలెడు సహాయం చేసిపెట్టిన సర్వర్ సుందరానికి టిప్ ఇవ్వటం మర్చిపోవద్దు ప్లీజ్." □